
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025



బియ్యం మాయం..!



ఆదోని పట్టణ శివారున శిరుగుప్ప సర్కిల్ సమీపంలో ఉన్న ఓ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారు. ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఆకస్మికంగా దాడులు చేశారు. 1,500-1,800 (ఒక్కో బస్తా 50 కిలోలు) బస్తాలు పట్టుకున్నారు. పట్టుబడిన పేదల బియ్యాన్ని స్వాధీనం చేసుకోమని సబ్ కలెక్టర్ భరత్‌కుమార్ సహా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తెల్లారేసరికి రేషన్ బియ్యాన్ని మాఫియా మాయం చేసింది. శనివారం ఉదయం తీరిగ్గా వెళ్లిన రెవెన్యూ అధికారులు గోదాములో 109 బస్తాలు సీజ్ చేశామని సెలవిచ్చారు. అర్ధరాత్రి గోదాములోని రేషన్ బియ్యం తెల్లారే సమయానికి ఏమయ్యాయి..? నిందితుల వెనుక ఉన్నది ఎవరు..? సివిల్ సప్లయ్ డైరెక్టరే నేరుగా రేషన్ బియ్యానికి కాపలా పెట్టమని సూచించినా పోలీసులు రక్షణ ఏర్పాటు ఎందుకు చేయలేదు? దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ఆదోని శివారులోని ఓ గోదాములో రేషన్ బియ్యం అక్రమ నిల్వ
- ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు దాడులు
- పట్టుబడిన 1,500-1,800 బస్తాలు
- రాత్రికి రాత్రే మాయం చేసిన రేషన్ మాఫియా
- ఇంతకూ నిందితులెవరు?

కర్నూలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏపీ ప్రభుత్వ ప్రజా పంపిణీ (సివిల్ సప్లయ్) విభాగం పర్యవేక్షణలో 2,437 నిత్యావసర సరుకుల పంపిణీ దుకాణాలు ఉన్నాయి. 12.05 లక్షల రేషన్ కార్డుదారులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతినెల 20 వేల మెట్రిక్ రేషన్ బియ్యం ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 6.72 లక్షల రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సగటున 11 వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 5.34 లక్షల రేషన్ కార్డుదారులకు 9 వేల మెట్రిక్ టన్నులు బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా రూ.వేల కోట్లు వెచ్చిస్తూ ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నాయి. ప్రతి వ్యక్తికి 5 కిలోలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తున్నారు. అయితే కొందరు రేషన్ బియ్యాన్ని అక్రమంగా సరిహద్దులు దాటించి ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్నారు. గత వైసీపీ హయాంలో ఉచిత బియ్యాన్ని అక్రమార్కులు పందికొక్కుల్లా తినేశారు. ఆదోని కేంద్రంగా జగన్ ప్రభుత్వ హయాంలో ఆనాటి వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధి తనయుడు ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వైసీపీ నాయకులు అధికార కూటమిలోని బీజేపీలో చేరి బియ్యం మాఫియా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది.



అర్ధరాత్రి తరువాత సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సమక్షంలో గోదాముకు తాళం వేస్తున్న వీఆర్వో రాజశేఖర్‌గౌడ్



ఆదోని పట్టణ శివారులోని గోదాంలోని రేషన్ బియ్యం బస్తాలు

దాడుల్లో బయటపడిన రేషన్ బియ్యం డంప్:

ఆదోని పట్టణ శివారున శిరుగుప్ప సర్కిల్ సమీపంలో ఓ ప్రైవేటు గోదాము అడ్డాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. సివిల్ సప్లయ్ డీలర్లు, కార్డుదారుల నుంచి కిలో రూ.9-10లకు కొనుగోలు చేసిన బియ్యాన్ని వివిధ మార్గాల ద్వారా ఆ గోదాముకు చేర్చి.. అక్కడి నుంచి రాత్రికి రాత్రే సరిహద్దులు దాటించి కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల ఒకటో తారీఖు నుంచి ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేసి.. డీలర్ల ద్వారానే కార్డుదారులకు బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. పంపిణీ చేసిన బియ్యాన్ని వివిధ మార్గాలు ద్వారా ఆదోని శివారులోని రహస్య గోదాముకు చేర్చారు. ఒక్కొక్క బస్తా 50 కిలోల చొప్పున తూకం వేసి రవాణాకు సిద్ధం చేస్తున్నారు. సమాచారం రావడంతో ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు శుక్రవారం రాత్రి ఆదోనికి చేరుకున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలత దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కల్లుబావి వీఆర్ఓ రాజశేఖర్‌గౌడ్, ఒకటో పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను మహేశ్‌నాయుడుతో పాటు పంపించారు. గోదాము తాళాలు తీసి చీకట్లో.. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో పరిశీలిస్తే.. గోదాం మొత్తం ఎటువైపు చూసినా తూకం వేసిన రవాణాకు సిద్ధం చేసిన రేషన్ బియ్యం బస్తాలే కనిపించాయి. దాదాపు 1,500-1,800లకు పైగా (ఒక్కో బస్తా 50 కిలోల చొప్పున 750-900 క్వింటాళ్లు) ఉంటాయని మహేశ్‌నాయుడు తెలిపారు.

మిగతా 3వ పేజీలో



తాళం వేసిన గోదాంలో మాయం కాగా మిగిలిన బియ్యం బస్తాలు ఇవే

డీఎస్సీకి 52 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా శనివారం ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 52 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండు పరీక్షా కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన పీజీటీ(నాన్ లాంగ్వేజ్) పరీక్షకు మొత్తం 380 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి వుండగా 52మంది గైర్హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

యోగాతో మానసిక ఉల్లాసం

కలెక్టర్ రాజకుమారి



యోగాలో పాల్గొన్న అధికారులు

నంద్యాల టౌన్/ హాస్పిటల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శనివారం స్థానిక పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21 న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమెతో పాటు జేసీ విష్ణుచరణ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాతో చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. యో గాను ప్రతి ఒక్కరు జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, యోగా గురువులు, సాధకులు పాల్గొన్నారు.

వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

- ఆ పార్టీని ప్రజలు నమ్మరు
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి




మాట్లాడతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని చూసి ఓర్వలేని మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై, విద్యా మంత్రి నారా లోకేశ్‌పై దిగజారుడు రాజకీయాలతో విష ప్రచారం చేస్తున్నారని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేఖర్ల సమావేశం బీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తల్లికి వందనం పథకంపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులకు, వారి తల్లులకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.8700 కోట్లు జమచేశామన్నారు. ఇలాంటి పథకం మీద దుష్ప్రచారం చేస్తున్న వైసీపీని ప్రజలు నమ్మరని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, పీ.వీ.కుమార్‌రెడ్డి, దొనపాటి భస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం నిర్లక్ష్యమో..!

- ఓ చోట 80 మంది విద్యార్థులకు ఒకే తల్లి పేరు
- మరోచోట 69 మంది విద్యార్థులకు..
- ఏమిటీ విడ్డూరం అంటున్న ప్రజలు
- 149 పిల్లలకు అందని తల్లికి వందనం

ప్యాపిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులమనే అహమో.. తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమానో గాని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తల్లుల పేర్లు సరిగా నమోదు చేయక పోవడంతో పలువురి పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాలేదు. దీంతో విద్యార్థుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్యాపిలి పట్టణంలోని 3వ సచివాలయంలో 80 మంది విద్యార్థులకు తల్లి పేరు ధర్మవరం మౌనిక అని, 4వ సచివాలయంలో 69 మంది విద్యార్థులకు తల్లి పేరు దాసరి శోభ అని నమోదు చేశారు. తల్లుల పేర్లు సరిగా నమోదు చేయకపోవడంతో విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమ కాలేదు. అధికారుల తీరుపై పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి జాబితాను సరిచేసి నిధుల వచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు.



అధికారులు నిర్లక్ష్యంగా తయారు చేసిన తల్లికి వందనం జాబితా

బంగారు అంబారీపై ప్రహ్లాదరాయలు



రజత గజవాహనంలో బంగారు అంబారీపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారీపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం జ్యేష్ఠ మాస తదియ శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

మహిళల రక్షణ కోసం 'శక్తియాప్': ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల రక్షణ కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శక్తియాప్ టీం ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ బృందాలు నిరంతరం పాఠశాలలు, కళాశాలలు, వద్ద గస్తీ నిర్వహించి ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు.

నీట్ ఫలితాలు విడుదల
ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
3

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- 21 నుంచి మొదటి విడత

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శనివారం ఏపీ పాలిసెట్ కన్వీనర్ గణేశ్‌కుమార్ విడుదల చేశారు. జూన్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మొదటి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ 1 ర్యాంక్ నుంచి 15,000 ర్యాంక్ వరకు, 22వతేదీ 15,001 నుంచి 32,000 వరకు, 23వ తేదీ 32,001 నుంచి 50,000 వరకు, 24వ తేదీ 50,001 నుంచి 68,000 వరకు, 25వ తేదీ 68,001 నుంచి 86,000 వరకు, 26వ తేదీ 86,001 నుంచి 1,04,000వరకు, 27వ తేది 1,04,001 నుంచి 1,20,000 వరకు, 28వ తేదీ 1,20,001 నుంచి చివరి ర్యాంక్ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 25వ తేదీన ఎన్‌సీసీ కేటగిరీ వారికి 1వ ర్యాంకు నుంచి 40,000 ర్యాంక్ వరకు, పీడబ్ల్యూడీ వారికి 1 నుంచి చివరి ర్యాంక్ వరకు, 26వ తేదీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కేటగిరీ వారికి 1 నుంచి 60000ల ర్యాంక్ వారికి, ఎన్‌సీసీ విద్యార్థులకు 40,001 నుంచి 80,000 ర్యాంక్ వరకు, 27వ తేదీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వారికి 60001 నుంచి చివరి ర్యాంక్ వరకు, ఎన్‌సీసీ వారికి 80001 నుంచి చివరి ర్యాంక్ వరకు, 28వ తేదీ సీఏపీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంగ్లో ఇండియన్స్‌కు 1వ ర్యాంక్ నుంచి చివరి ర్యాంక్ వరకు సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆప్షన్‌ల ఎంపిక అనంతరం చివరగా జులై 3వ తేదీన సీట్లు అలాట్‌మెంట్ అవుతాయని అన్నారు. మొదటి ర్యాంక్ నుంచి చివరి ర్యాంక్ అభ్యర్థుల వరకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 ఫీజు చెల్లించాలని తెలిపారు. ఈనెల 27వ తేదీలోపు ఫీజు చెల్లింపుకు చివరి తేదీ అన్నారు.

దర్శనం టికెట్లలో గోల్‌మాల్

మహానంది ఆలయంలోని ఏజెన్సీ ఉద్యోగిపై చర్యలు

మహానంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో భక్తులకు ఇచ్చే దర్శనం టికెట్ల విక్రయంలో గోల్‌మాల్ జరిగిన విషయంపై ఏజన్సీ ప్రాతిపదికన విధులు నిర్వహించే తారకేశ్వరుడ్ని విధు ల నుండి తొలగించినట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి మోహన్ తెలి పారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన శనివారం తెలిపారు. మహానంది ఆలయంలో దర్శనం టికెట్ రూ. 20 కాగా రూ 40 అదనంగా వసూలు చేసి టికెట్లు ఇవ్వకుండా తారకేశ్వరుడు పంపాడని తమ విచారణలో వెలుగులోకి వచ్చిందని దేవదాయశాఖ అధికారి తెలిపారు. దీంతో ఏజెన్సీ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న తారకేశ్వరుడ్ని శాశ్వతంగా తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు, గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ప్లస్

కర్నూలు ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్ లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసీకి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!



ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యక్తికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃప్రవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.



ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నీట్ ఫలితాలు విడుదల

- కర్నూలు పట్టణానికి చెందిన వారిదే హవా
- ఆలిండియా స్థాయిలో గోవర్ధన్‌చౌదరికి 431వ ర్యాంకు
- ఎస్టీ కేటగిరిలో మెగావత్ అఖిల్ బాలాజీ నాయక్‌కు 27వ ర్యాంకు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మెడికల్, డెంటల్ యునాని కోర్సుల ప్రవే శాల కోసం నిర్వహించిన నీట్-యూజీ-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదల య్యాయి. కర్నూలు పట్టణానికి చెందినవారే హవా కొనసాగించారు. ఈ పరీక్ష ఫలితాల్లో కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన ఆర్.గోవర్ధన్ చౌదరి 621/720 మార్కులతో జనరల్ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 431వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 281వ ర్యాంకు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. డి.హేమ సాగరిక 595 మార్కులతో ఆలిండియా స్థాయిలో 1721వ ర్యాంకును, కేటగిరిలో 44వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. సఫా సైఫా ఖురేషీ 585 మార్కులు, జనరల్ కేటగిరిలో ఆలిండియా స్థాయిలో 22814వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 1505వ ర్యాంకు సాధించారు. అఖిల్ బాలాజీనాయక్ మెగావత్ 576 మార్కులతో ఆలిండియా స్థాయిలో 4169వ ర్యాంకును, ఎస్టీ కేటగిరిలో 27వ ర్యాంకును, ఎస్.సమిత్ 572 మార్కులతో ఆలిండియా స్థాయిలో 4970వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 2453వ ర్యాంకును, శ్రీసాయి ఫణీంద్ర దాసరి 570 మార్కులతో ఆలిండియా స్థాయిలో 5369వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 126వ ర్యాంకును, జయాంశ 551 మార్కులతో ఆలిండియా స్థాయిలో 11587వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 4926వ ర్యాంకును సాధించారు. గూడూరు చెందిన చంద్రశేఖర కుమార్తె శ్రీధన్య 592 మార్కులతో ఆలిండియా స్థాయిలో 2032వ ర్యాంకు సాధించారు. కార్తీక్ మాచాని 560 మార్కులతో ఆలిండియా స్థాయిలో 8421వ ర్యాంకును, కేటగిరి విభాగంలో 3468వ ర్యాంకు, పగిడ్యాల దీపిక 544 మార్కులతో ఆలిండియా స్థాయిలో 14962వ ర్యాంకును, ఎస్సీ కేటగిరిలో 335వ ర్యాంకును, బి.ప్రసన్నదీప్ 543 మార్కులతో ఆలిండియా స్థాయిలో 15,548వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 353వ ర్యాంకును, గురు పృథ్వి 538 మార్కులతో ఆలిండియా స్థాయిలో 18657వ ర్యాంకును, ఎస్సీ కేటగిరి విభాగంలో 419వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈసారి విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో వంద లోపు ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు లేకపోవడం కొసమెరుపు.

కార్డియాలజిస్టు అవుతా



మెడిసిన్ చదివి కార్డియాలజిస్టు అవుతా. తండ్రి రామాంజనేయులు నాయక్ పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్. తల్లి సావిత్రిబాయి కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా పనిచేస్తున్నారు. నీట్ పరీక్షలో 576మార్కులు, ఆలిండియా స్థాయిలో 4169వ ర్యాంకు, ఎస్టీ కేటగిరి విభాగంలో 27వ ర్యాంకును సాధించా. జిప్‌మర్ యూనివర్సిటీలో మెడిసిన్ చేసి కార్డియాలజిస్టుగానూ, రేడియాలజిస్టుగా స్థిరపడాలన్నదే లక్ష్యం. ఈర్యాంకు రావడానికి తల్లిదండ్రులు, అధ్యాపకులు, సోదరి ప్రోత్సాహమే కారణం.

● అఖిల్ బాలాజీనాయక్ మెగావత్, కర్నూలు

డాక్టరై వైద్యసేవలు అందిస్తా



గొప్ప డాక్టర్‌నై పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నది లక్ష్యం. నారాయణ కళాశాలలో ఇంటర్ వరకు చదివా. ఇంటర్‌లో 977/1000 మార్కులు సాధించా. నీట్ పరీక్షలో 621/720 మార్కులతో ఆలిండియా స్థాయిలో 431వ ర్యాంకును, కేటగిరి వారిగా 281వ ర్యాంకు సాధించా. కర్నూలు నగరంలోనే అగ్రస్థానంలో నిలిచా. తల్లిదండ్రులు యుగంధర్ చౌదరి, తల్లి యామిని అభినందించారు.

● ఆర్.గోవర్ధన్ చౌదరి, సంతోష్‌నగర్, కర్నూలు (621 మార్కులు, 431వ ర్యాంకు)

ర్యాంకు రావడం ఆనందంగా ఉంది



డాక్టర్ కావాలన్నదే లక్ష్యం. పడిన కష్టానికి ఉత్తమ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. తండ్రి డా.బీవీ శ్రీహరిబాబు. జి.పుల్లారెడ్డి డెంటల్ కళాశాలలో ప్రొఫెసర్. తల్లి మంజుల వాణి ఎంపీడీవో, ప్రస్తుతం డీపీఆర్‌సీలో జిల్లా కోఆర్డినేటర్. ఇంటర్ కర్నూలు నారాయణ కళాశాలలో చదివా. ఇంటర్‌లో 937/1000 మార్కులు సాధించా.

● డి.హేమ సాగరిక, 595 మార్కులు, ఎస్సీ కేటగిరిలో 44వ ర్యాంకు

ప్రజలకు సేవ చేస్తా



కార్డియాలజిస్టు అయి ప్రజలకు సేవ చేస్తా. అమ్మ శ్యామల కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో అధ్యాపకురాలు. ఇంటర్ కర్నూలు నారాయణ కాలేజీలో చదివా. ఇంటర్ పబ్లిక్ పరీక్షలో 980/1000 మార్కులు సాధించా. దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ, భూపాల్, వంటి ప్రముఖ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేయాలన్నదే ధ్యేయం. ఉత్తమ ర్యాంకు రావడానికి అమ్మ ప్రోత్సాహంతో పాటు అధ్యాపకుల కృషి ఎంతగానో ఉంది.

● దాసరి శ్రీసాయి ఫణీంద్ర, 570 మార్కులు, ఆలిండియా స్థాయిలో 5369, ఎస్సీ కేటగిరిలో 126వ ర్యాంకు

ఎమ్మిగనూరు విద్యార్థికి 133వ ర్యాంకు

- కార్డియాలజిస్టు కావడమే లక్ష్యం: మహ్మద్ సోహెల్



తల్లిదండ్రులతో ఎస్కే మహ్మద్ సోహెల్

ఎమ్మిగనూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో ఎమ్మిగనూరుకు చెందిన విద్యార్థి ఎస్కే మహ్మద్ సోహెల్ జాతీయస్థాయిలో 640 మార్కులతో ఓసీలో 133వ ర్యాంకు సాధించి కేటగిరి విభాగంలో 94వ ర్యాంకుతో జిల్లాలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచాడు. కోడుమూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కమల్‌సాహెబ్, బదినేహాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ నసీమున్నీసా ఎమ్మిగనూరు పట్టణంలోని మునెప్పనగర్‌లో నివా సం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు బీటెక్ పూర్తి చేయగా, మరో కుమారుడు ఎస్కే మహ్మద్ సోహెల్ ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తిచేశాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ఎస్కే మహ్మద్ సోహెల్ ప్రతిభ కనబరిచాడు. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 640 మార్కులతో ఓసీ కేటగిరిలో 133వ ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎస్కే మహ్మద్ సోహెల్‌ను అభినందించి మిఠాయిలు తినిపించారు. సోహెల్ మాట్లాడుతూ అమ్మానాన్నల ప్రోత్సాహంతోపాటు గురువులు సూచించిన ప్రకారం చదివి ఈ ర్యాంకును సాధించానన్నారు. కార్డియాలజిస్ట్ కావలన్నదే తన లక్ష్యమని, పేదలకు ఉచిత వైద్యం అందిస్తానన్నారు.

నీట్‌లో నంద్యాల విద్యార్థుల ప్రతిభ



221వ ర్యాంక్ సాధించిన భువన్‌తేజ



8446 ర్యాంక్ సాధించిన దీక్షిత్‌రెడ్డి



753 ర్యాంక్ సాధించిన ప్రదీప్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. నంద్యాల ఎస్‌డీఆర్ కళాశాలకు చెందిన భువన్‌తేజ 610 మార్కులు సాధించి 221వ ర్యాంక్ సాధించాడు, పట్టణంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సంజీవకుమార్ కుమారుడైన భువనతేజ తాను డాక్టర్‌గా వైద్యసేవలు అందిస్తూ తన తండ్రి బాటలో నడుస్తానని చెబుతున్నాడు. పాణ్యం గ్రామానికి చెందిన న్యాయవాది శ్రీకాంత్ కుమా రుడు జితేంద్ర 6586వ ర్యాంక్ సాధించాడు. నంద్యాలకు చెందిన న్యాయవాది రూపేంద్ర నాథ్‌రెడ్డి కుమారుడు దీక్షిత్‌రెడ్డి 8446 ర్యాంక్ దక్కించుకున్నాడు. ఎస్‌డీఆర్ కళాశాలలో చదివి కడపకు చెందిన వ్యవసాయ రైతు పెద్దమునిరెడ్డి కుమార్తె మునిజాహ్నవి 9642 ర్యాంక్ సాధించారు. ఎస్సీ కేటగిరీలో హనోక్‌స్పురన్‌రాజ్ 424 మార్కులు సాధించి 8774 ర్యాంక్ పొందాడు. న్యూక్లియస్ కళాశాలకు చెందిన ప్రదీప్ కుమార్ 753వ ర్యాంక్, ప్రియాంక 7500 ర్యాంక్, మౌనిక 9299 ర్యాంక్, సాధించారు.

అక్షరశ్రీ జూనియర్ కళాశాలకు...



రేచల్ విక్లీఫ్

ఆదోని అగ్రికల్చర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని అక్షర శ్రీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రేచల్ వీక్లిఫ్ ప్రతిభ చాటింది. నీట్‌లో 564/720 మార్కులు సాధించింది. 7178 ఆల్ ఇండియా ర్యాంకు రాగా, ఓపెన్ కేటగిరిలో 3355 ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా, తల్లి సంధ్యారాణి మోటివేషన్ స్పీకర్‌గా, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారిగాపనిచేస్తున్నారు. కళాశాల యాజమాన్యం మేఘనాథ్ రెడ్డి అభినందించారు.

వక్ఫ్ చట్టాన్ని పరిరక్షించుకోకపోతే మైనార్టీల మనుగడే కష్టం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ



మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత అసాదుద్దీన్ ఓవైసీ

ఆదోని అగ్రికల్చర్, జూన్14(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని పరిరక్షించుకోకపోతే మైనార్టీల మనుగడకే కష్టమని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. శనివారం రాత్రి జామియా మసీదు వెనక భాగంలోని మసూదియా పాఠశాల ఆవరణలో ఆలిండియా ముస్లీం లా బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టంపై బహిరంగ సభ నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కేవలం ముస్లింలపై ఉన్న శ్రద్ధ దేశ రక్షణపై లేదని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్, కుమారస్వామి ఎందుకు మద్దతు తెలిపారో ప్రజలకు చెప్పాలన్నారు. బ్రిటీష్ కాలంనాటి వక్ఫ్ ఆస్తులు మాత్రమే ఉన్నాయని, అలాంటి చట్టాన్ని మార్చడం దుర్మార్గమన్నారు. సమావేశంలో ముస్లీం మైనార్టీ నాయకులు హజ్రత్‌మౌలానా, జాకీర్‌సాబ్, ఖలీజ్‌సైఫుల్లా రహమాన్, నిజామీజల్లానయ్యద్, జుబేర్‌సాహెబ్, మౌలానా సయ్యద్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస పాలన

- బాబు అధికారంలో చీకటి రోజులు
- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు బంగారు భవిష్యత్తు ఇవ్వగా కూటమి ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని నంద్యాల వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని తన స్వగృహంలో ఆయన కూటమి ప్రభుత్వ ఏడాది వైఫల్యాలపై బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్యతో కలిసి పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ఏడాది పాలనలో చీకటి రోజులని అన్నారు. సీఎం, ఆయన తనయుడు లోకేశ్ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాం గం పేరుతో అరాచకాన్ని సృష్టించారని కాటసాని తెలిపారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఈపుస్తకం అందుబాటులో ఉంచుతామన్నారు. కార్పొరేటర్లు, వైసీపీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గురువు మృతి

కోడుమూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జంగం వీరభద్రయ్యస్వామి (83) కన్నుమూశారు. వీరభద్రయ్యస్వామి చిన్నతనం నుంచే దైవభక్తిలో గడిపారు. ఎన్నో ఆలయాలు నిర్మించారు. ఆయనకు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో శిష్యులు ఉన్నారు. కొంతకాలంగా కర్నూల్లో నివాసం ఉంటున్న స్వామీజీ శుక్రవారం రాత్రి వయోభారంతో పరమపదించారు. దీంతో ఆయన భౌతికాయాన్ని లద్దగిరి మజారా రామాపురంలోని సొంత పొలంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలిసి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల కవితమ్మ, సర్పంచ్ పట్టి హనుమంతు వేర్వేరుగా సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి శిష్యబృందం విచ్చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా శివరాముడు



ఏవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డీఆర్వో కార్యాలయంలో శనివారం కలెక్టరేట్ ఏవోగా శివరాముడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏపీఆర్ఎస్ఏ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కలెక్టరేట్ అధ్యక్షులు వెంకట్‌రాజు, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, లోకేశ్, రామాంజనేయులు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

బియ్యం మాయం..!

మెదటి పేజీ తరువాయి

గోదాములో అక్రమంగా నిల్వ చేసిన బస్తాలు వీడియో తీసుకొని వీఆర్ఓ రాజశేఖర్‌గౌడ్, పోలీస్ కానిస్టేబుళ్ల సమక్షంలో తాళం వేసి.. రేషన్ బియ్యం వీడియోలు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు పంపించారు.



రహస్య గోదాములో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న మహేశ్‌నాయుడు, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్

రాత్రికి రాత్రే మాయం

శుక్రవారం అర్ధరాత్రి ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సమక్షంలో వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ తాళం వేసిన గోదామును శనివారం ఉదయం తెరిచారు. అక్రమంగా నిల్వ చేసిన 109 బస్తాలు రేషన్ బియ్యం సీజ్ చేశామని, 6ఏ కేసు నమోదు చేస్తామని డిప్యూటీ తహసీల్దారు బాబు వివరించారు. అర్ధరాత్రి తనిఖీల్లో 2 వేలకు పైగా బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయని డైరెక్టర్ మహేశ్‌నాయుడు సబ్ కలెక్టర్‌కు వీడియోలు పెట్టారు. తెల్లారే సమయానికి 109 బస్తాలే ఉన్నాయి. రాత్రికి రాత్రి రేషన్ బియ్యం ఎట్లా మాయమయ్యాయి? దీని వెనుక ఉన్నది ఎవరు? సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు వెళ్లిన వీఆర్ఓ వేసిన తాళం తీసి రేషన్ బియ్యం తరలించడం వెనుకు ఆంతర్యమేమిటి..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ హయాంలో ఆదోని కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాను పెంచిపోషించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. వైసీపీ నాయకులు కొందరు బీజేపీలో చేరారు. వైసీపీ నుంచి కూటమి పార్టీలో చేరిన మండల స్థాయి ప్రజాప్రతినిధి తనయుడు రేషన్ బియ్యం దందా సాగిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఆయనే ఈ భాగోతం నడిపించాడా..? దీని వెనుక మరొకరు ఉన్నారా..? రహస్య గోదాములో భారీ ఎత్తున రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయని, అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆదోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరాం దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు ఏర్పాటు చేయలేదు..? అనే ప్రశ్నలు తెలుత్తున్నాయి.

నాడు బేతంచర్లలో..

నంద్యాల జిల్లా బేతంచర్ల పట్టణంలో వైసీపీ హయాంలో చక్రం తిప్పిన అప్పటి ఓ కీలక మంత్రి సమీప బంధువులకు చెందిన గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారనే సమాచారంతో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు తనిఖీ చేయగా 1,200 బస్తాలు బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆ గోదాం నిర్వాహకులకు రూ.60 లక్షలు ఫైన్ వేసినట్లు తెలిసింది. ఆ తరువాత పాణ్యంలో దాడులు చేసి ఒక గోదాంలో 750 బస్తాలు, మరో గోదాంలో 217 బస్తాలు పేదల బియ్యం సీజ్ చేశారు. నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తే.. వివిధ దాడుల్లో పట్టుబడి సీజ్ చేసిన దాదాపు 900 బస్తాలు బియ్యం మాయం చేసినట్లు గుర్తించారు. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామం సమీపంలో పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి 135 బస్తాలు (54 క్వింటాళ్లు) బియ్యం, తుగ్గలి మండలం రాంపల్లి సమీపంలో అక్రమ రవాణా చేస్తున్న లారీ, ఓ కారును సీజ్ చేసి 1,100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు సీజ్ చేశారు. వెలుగు చూసిన సంఘటనలు కొన్ని. నిఘా కళ్లకు గంతలు కట్టి నెలనెల వందల లారీల రేషన్ బియ్యం సరిహద్దులు దాటికి కర్ణాటకకు తరలిపోతున్నాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

● సివిల్ సప్లయ్ మంత్రికి ఫిర్యాదు చేస్తాను



మా తనిఖీలో 50 కిలోలు చొప్పున తూకం వేసి రవాణాకు సిద్ధం చేసిన దాదాపు 1,500-1,800 బస్తాలు ఉన్నట్లు గుర్తించాం. తెల్లారాక 109 బస్తాలే ఉన్నాయని డిప్యూటీ తహసీల్దారు బాబు చెప్పారు. రాత్రి వీఆర్ఓ సమక్షంలోనే సీజ్ చేశాం. దీనిపై సివిల్ సప్లయ్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహన్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఎండీ మంజీర్ జిలానీసమూన్‌కు ఫిర్యాదు చేస్తాను.

- రమేశ్‌నాయుడు, డైరెక్టర్, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్

విచారణ చేయిస్తాం



ఆదోనిలోని ఓ గోదాంలో రహస్యంగా నిల్వ చేసిన 109 బస్తాల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు మండల అధికారుల నుంచి మాకు సమాచారం వచ్చింది. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తాం. అంతకుమంచి మాకు సమాచారం లేదు.

● రాజారఘువీర్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి, కర్నూలు

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 394 గ్రాముల బంగారు, 326 గ్రాముల వెండి, ల్యాప్ టాప్ స్వాధీనం
- విలువ సుమారు రూ.39 లక్షలు



నిందితుల అరెస్టును చూపుతున్న నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

నంద్యాల టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నందికొట్కూరు పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు. నందికొట్కూరులోని బాలాజీ నగర్‌లో ఇటీవల దొంగతనం జరిగింది. ఈ కేసుపై నందికొట్కూరు పోలీసులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 13న నందికొట్కూరులోని ఆత్మకూరు రోడ్డులో మిర్యాలగూడకు చెందిన వేముల శంకర్, గుంటూరు జిల్లాకు చెందిన పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు కర్నూలు, నంద్యాల, గుంటూరు, తూర్పు గోదావరి, అనంతపురం, అన్నమయ్య, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన దొంగతనం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు తేలింది. శంకర్‌పై 21 కేసులు, పవన్‌కుమార్ 36 కేసులు ఉన్నాయి. వీరి నుంచి 394 గ్రాముల బంగారు ఆభరణాలు, 326 గ్రాముల వెండి వస్తువులు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.39 లక్షలు ఉంటుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కుమార్, సిబ్బంది శ్రీనివాసులు, బాలకృష్ణ, ఓబయ్య, ఇబ్రహీం, యేసుదాస్, చంద్రశేఖర్, గంగారం, చిన్నమద్దిలేటి, మాలిక్‌బాషా, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం


దాతకు స్వామివారి పటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన జె. నిరంజన దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ పర్యవేక్షకుడు రవికుమార్ రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం, స్వామిపటం అందించారు. అర్చకులు నిరంజన దంపతులను ఆశీర్వదించారు.

కార్మికుల పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో స్కీం వర్కర్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, హెల్పర్ల పిల్లలందరికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని అన్నారు.

చేగువేరా జీవితం యువతకు ఆదర్శం


చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విప్లవయోధుడు చేగువేరా జీవితం నేటి యువతకు ఆదర్శమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చేగువేరా జయంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ చేగువేరా అడుగుజాడల్లో యువత పయనించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిన్న, వెంకట్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

'కగార్' పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు

● సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావు


మాట్లాడుతున్న బుగత బంగారు రావు

నందికొట్కూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్' పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తూ అమాయక ఆదివాసీ ప్రజలను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తూ ప్రభుత్వం దుర్మార్గపు పాలన కొనసాగిస్తోందని సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావు ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని వినోద్ మిశ్రా భవన్‌లో సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగత బంగారురావు మాట్లాడుతూ దేశంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, మహిళా సంఘం నాయకులు బీబీ, లక్ష్మీదేవి, మల్లీశ్వరమ్మ, ఏఐసీసీటియు నాయకులు రామకృష్ణ, భాస్కర్ గౌడ్, సామన్న, శివకుమార్, నరసింహ, రైతు సంఘం నాయకులు సుధాకర్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నంద్యాల రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ విమర్శించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చేతి వృత్తిదారుల సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

నేడు డీసీఎంఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల మార్కెట్ సర్వీసెస్ సొసైటీ చైర్మన్‌గా ఎంపికైన నాగేశ్వరయాదవ్ ఆదివారం నంద్యాల టెక్కె మార్కెట్‌యార్డులో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరయాదవ్ మాట్లాడుతూ ప్రమాణ స్వీకారోత్సవానికి రెండు జిల్లాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నట్లు తెలిపారు.

'అమ్మఒడి'తో మోసం చేసిన వైసీపీ

● చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికి వందనం

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చదువకుంటున్న పిల్లలందరికీ అమ్మఒడి ఇస్తానని ఒక్కరికి మాత్రమే ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని తలముడిపి గ్రామంలో తల్లికి వందనం ద్వార లబ్ధిపొందిన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతున్న పిల్లలందరికీ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అందజేసిందన్నారు. ఒక్కోవిద్యార్థికి రూ.13వేలు తల్లి ఖాతాలో జమచేసిందన్నారు. తలముడిపి గ్రామానికి చెందిన హనిసాకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ62470 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు శివరామి రెడ్డి, సర్వోత్తమరెడ్డి, రవీంద్రబాబు, రమణ రెడ్డి, పురుసోత్తం రెడ్డి, సధాకర్ రెడ్డి, నరసింహగౌడు, షబ్బు బాషా తదితరులు పాల్గొన్నారు.

● మిడుతూరుకు చెందిన పాత్రికేయుడు మధుసూదన్‌బాబు అనారోగ్యం బారినపడి కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శనివారం మిడుతూరుకు చేరుకుని మృతదేహానికి పూల మాలవేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

లబ్ధిదారుల హర్షం : నందికొట్కూరు: తల్లికి వందనం పథకాన్ని లబ్ధి పొందిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని సంగయ్యపేటలో తల్లికి వందనం ద్వారా లబ్ధి పొందిన చిన్నారులు, వారి కుటుంబాలతో ఎమ్మెల్యే గిత్తా కలిసి సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడి యం వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు వనజ, వేణుగోపాల్, లింగమయ్య, ఆర్టు శ్రీను, సత్తార్ మియ్యా, హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరు పట్టణంలో ముగ్గురు తల్లికి వందనం లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

రామచంద్రారెడ్డి మృతికి సంతాపం

పగిడ్యాల: ప్రముఖ విద్యాసంస్థల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి(52) అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కలిసి సంతాపం తెలిపారు. టీడీపీ మండల కన్వీనరు పలువాని మహేశ్వరరెడ్డి, నాయకులు దామోదరరెడ్డి, రాజశేఖరరెడ్డి, వాసురెడ్డి తదితరులు ఉన్నారు.

రక్తదానం ఎందరికో ప్రాణదానం

కల్నల్ జోబి ఫిలిప్


ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

నంద్యాల హాస్పిటల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ఎంతోమందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ జోబి ఫిలిప్ అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవంలో భాగంగా శనివారం ఎన్‌సీసీ కేడెట్లు రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ర్యాలీని ప్రారంభించగా, ఎన్‌జీవోస్ కాలనీ ప్రభుత్వ ఆస్పత్రి వరకు సాగింది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌సీసీ కేడెట్లు, ఆఫీసర్లు రక్తదానం చేశారు. కమాండెంట్ జోబి ఫిలిప్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, యోగా శిక్షకురాలు లలితాసరస్వతి, ఎన్‌సీసీ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన పాణ్యం బాలిక

● జాతీయ స్థాయిలో 18,897వ ర్యాంక్

పాణ్యం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ వైద్య ప్రవేశ పరీక్షలో కురువ ప్రవల్లిక జాతీయ స్థాయిలో 18897 వ ర్యాంకు సాధించింది. పాణ్యం అయ్యపురెడ్డి కాలనీకి చెందిన వేణుగోపాల్, కురువ శివలక్ష్మి దంపతుల రెండవ కుమార్తె ప్రవల్లిక 537 మార్కులు సాధించారు. మంచి ర్యాంకు సాధించడంతో స్థానికులు బాలికను అభినందించారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ

నంద్యాల రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ 2025 ఫలితాల్లో నంద్యాల పట్టణ శివారులోని ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంక్‌లు సాధించినట్లు కళాశాల చైర్మన్ కొండారెడ్డి శనివారం తెలిపారు. పి. భువనేశ్వరి 543 మార్కులతో ఆల్ ఇండియాలో 221 ర్యాంక్, పీపీ జితేంద్ర 543 మార్కులతో 6586 ర్యాంక్, వై దీక్షిత్‌రెడ్డి 535 మార్కులతో 8446 ర్యాంక్, ఎం మునిజాహ్నవి 530 తో 9642వ ర్యాంక్, బి. హనూక్‌స్పురన్‌రాజ్ (ఎస్సీ) 424 మార్కులు సాధించి 8774వ ర్యాంక్, వై. అఖిల (ఎస్సీ) 414 మార్కులు 10611వ ర్యాంక్‌లు సాధించారన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను, అద్భుతమైన ఫలితాలు సాధించేలా కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు.

షరతులు విధించడం సరికాదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలుకోసం షరతులు విధించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వ్యవసాయం పెట్టుబడి సాయం కోసం మొదటి సంవత్సరం ఇవ్వకుండా ఎత్తివేశారన్నారు. రైతులను ఆదుకునేందుకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, బెస్తరాజు, రామకృష్ణ, రమణయ్య పాల్గొన్నారు.

వైభవంగా సుంకులా పరమేశ్వరి
ఆలయ వార్షికోత్సవం


బోనాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా కరివేనలో ఊరేగింపు

ఆత్మకూరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేన గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తొమ్మిది కలశాలతో అభిషేకాది క్రతువులు నిర్వహిం చి ప్రత్యేక అలంకరణ గావించి, గణపతి పూజ అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు పర్యవేక్షణలో దంపతుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం చండీ హోమం, గణపతి హోమం, రుద్రహోమాలను నిర్వహించారు. ఆయా కార్యక్ర మాల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మ వారికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అమ్మవారి, పోతురాజుల వేషధారణలతో సాగిన బోనాల ఊరేగింపు ఆకర్షణగా నిలిచింది

రాష్ట్ర స్థాయి అంధుల చెస్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లూయీ బ్రెయిలీ అంధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీవనజ్యోతి అంధుల వసతి గృహం ఆవరణలో రాష్ట్రస్థాయి అంధుల చెస్ పోటీలను శనివారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈచెస్ పోటీల్లో రాష్ట్రస్థాయి నుంచి అంధ చెస్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ క్రీడల్లో కూడా దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడాపాలసీ తీసుకువచ్చారన్నారు. దివ్యాంగ క్రీడలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. ప్రభుత్వం ఉద్యోగ క్రీడా కోటాలో దివ్యాంగులకు కూడా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు షీల్డులు, నగదు బహుమతులను డాక్టర్ రామకృష్ణారెడ్డి అందజేశారు. భోజన వసతి, క్రీడా దుస్తులు భవనాశి జ్యువెలర్స్ యజమాని భవనాశి నాగమహేష్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కల్నల్ ఫిలిప్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, జీవనజ్యోతి పాఠశాల నిర్వాహకుడు వలిబాషా, యాతం చంద్రమౌళీశ్వరరెడ్డి, నాయకులు జోజిరెడ్డి, మహేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, గోవిందనాయుడు, బుగ్గరాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపు 5వేల మందితో యోగా

నంద్యాల నూనెపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో ఐదు వేల మందితో యోగా కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఉదయం 10:30గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మార్పును గమనించి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఆర్డీవో


సంగమేశ్వరున్ని దర్శించుకుంటున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి

కొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సప్తనదుల సంగమేశ్వర స్వామిని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి దర్శించుకున్నారు. శనివారం సంగమేశ్వర స్వామిని దర్శించుకున్న నాగజ్యోతిని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ప్రత్యేక అభిషేకాది క్రతువులు చేయిం చారు. ఆదివారం లోపు సంగమేశ్వరం ఆలయంలోని గర్భాలయంలోని వేపదారు శివలింగం నీటమునిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆర్డీవో నాగజ్యోతి చివరిసారిగా సంగమే శ్వరున్ని దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయ పురోహితులను సంగమేశ్వరస్వామి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట స్థానిక వీఆర్వో వేణుగోపాల్ గౌడు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత

మహానంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట కవిత అన్నారు. మండలంలోని గోపవరం-2 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో జరిగే బాల్యవివాహాలను నిర్మూలించేందుకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, తేజస్విని పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం

బండిఆత్మకూరు జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడమల కాల్వ గ్రామంలో వెలసిన శివనంది, చెన్నకేశవ, వేంకటేశ్వర, భైరవస్వామి ఆలయ భూముల వేలం ప్రశాంతంగా సాగినట్లు ఈవో ఆకృతి నాగప్రసాద్ తెలిపారు. శనివారం పరిశీలకుడు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించినట్లు వెల్లడించారు. శివనందీశ్వరుడి ఆలయానికి చెందిన 23.28 ఎకరాలకు రూ.5,22,000లు, చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 35.12 ఎకరాలకు రూ.8,43,000, అలాగే వేంకటేశ్వరస్వామికి చెందిన ఆలయ భూమికి రూ.1,66,000 ఆదాయం వచ్చిందన్నారు. భైరవస్వామి ఆలయానికి చెందిన 10.70 ఎకరాలకు రూ.4,06,000ఆదాయం వచ్చినట్లు ఈవో వివరించారు. లిచింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్పార్బీసీలో యోగాసనాలు


పాద హస్తాసనం చేస్తున్న దృశ్యం

నంద్యాల మున్సిపాలిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్సార్బీసీ సర్కిల్- 2 ఆవరణలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డీఈఈ శ్రీదేవి, కార్యాలయ ఉద్యోగి సంపత్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు పలు ఆసనాలు వేశారు. అనంతరం డీఈఈ శ్రీదేవి మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు పలు రోగాలు తగ్గుముఖం పడతాయని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జె. మోహన్, మల్లికార్జున, మల్లేశ్వరి, వీర ప్రతాప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


బండిఆత్మకూరులో యోగా చేస్తున్న అధికారులు, ప్రజలు

బండిఆత్మకూరు జూన్14(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుందని స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహేమాన్ సూచించారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బండిఆత్మకూరులో ప్రజలు, విద్యార్థులు వేర్వేరుగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగాతో కలిగే లాభాలను వివరించారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో దస్తగిరి, తహసీల్దార్ పద్మావతమ్మ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


యోగాంధ్రలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

మహానంది, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంత లభిస్తుందని, మనిషి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని పలువురు అధికారులు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గోపవరం గ్రామంలోని సుంకులమ్మ ఆలయ పరిసరాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు యోగాసనాలను వేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి సుహాసిని, మహిళ పోలీస్ అరుణ, నీటిసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, వీఆర్వో జయరాముడు, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, తేజస్విని, సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం: తహసీల్దార్

వెలుగోడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆపస్ కార్యాలయ ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొని యోగాసనాలు చేశారు. సర్పంచ్ జయపాల్, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం, ఖలీల్, ఎంఈవో బ్రహ్మంనాయక్, ఈవోఆర్డీ మురారి, ఏఈ రవీంద్రనాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం


పాణ్యంలో యోగా మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థినులు

పాణ్యం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యోగాతో మానసిక ఆరోగ్యం సాధ్యమని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో యోగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 176 ప్రాంతాల్లో యోగా శిక్షకుల ద్వారా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములను చేసి వారితో యోగాసనాలు వేయించారు. జిల్లా స్థాయి యోగా పోటీలలో గెలుపొందిన లక్ష్మీనరసింహ అనే బాలుడు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవో ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, ఆయుష్ వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రంగరమేష్, పొదుపు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు చేస్తున్న అధికారులు

కొత్తపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. శనివారం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్‌గా తహసీల్దార్ ఉమారాణి వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ, డీటీ అరుణ, స్థానిక హైస్కూల్ హెచ్ఎం వెంకటరమణ, సర్పంచ్ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

వెలుగోడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కాలంలో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బాటిళ్లను శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ శివార్లలోని వన్‌ఆర్‌తూమ్ సమీపంలో పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్స్‌కవేటర్ సహకారంతో మద్యం బాటిళ్లను తొక్కించారు. ఖాళీ సీసాలను నిప్పుపెట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజీనాయక్, సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేశ్, వీఆర్వో చక్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు

పెద్దకోనేరు శుభ్రపరిచారు



పెద్దకోనేరులో పూడికతీత పనులు చేస్తున్న పేరుసోమల గ్రామస్థులు

సంజామల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోమల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన పెద్దకోనేరు ఐదు దశాబ్దాలుగా పూడికతో నిండిపోయింది. మన ఊరు- మన గుడి - మన బాధ్యత అంటూ గ్రామస్థులు ఒక్కతాటిపైకి వచ్చి పూడికతీత పనులు ప్రారంభించారు. గ్రామ పెద్ద ఆధ్వర్యంలో గ్రామస్థులు దాదాపు 400మంది గత మూడు రోజుల నుంచి పెద్దకోనేరులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. శనివారం మొదటి విడత పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు యంత్రాలతో చేపట్టనున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఒకవైపు కోనేరుకు సంబంధించిన మెట్లు కుంగిపోయి ఉన్నాయని దాతలు ముందుకు వచ్చి కోనేటిని మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేద విద్యార్థినికి చేయూత



విద్యార్థికి అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న బోయ సురేష్

డోన్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో అత్యంత మార్కులు సాధించిన పేద విద్యార్థికి చేయూత అందించారు. డోన్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన పేద విద్యార్థిని స్రవంతి మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ గ్రూపులో 974 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. డాక్టర్ చదివి పేదలకు ఉచిత వైద్యసేవలు అందించాలని ఆ విద్యార్థిని తన ఆశయాన్ని వెల్లడించింది. స్పందించిన మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రొఫెషనల్ వింగ్ ప్రెసిడెంటు బోయ సురేష్ నాయుడు కొంత మంది దాతల సహకారం తీసుకుని హైదరాబాదులోని శ్రీ చైతన్య కాలేజీలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అడ్మిషన్ చేయించారు. ఆ విద్యార్థి ఆశయ సాధన కోసం పై చదువుల కోసం రూ.1.50 లక్ష దాకా నిధులు దాతల సహకారంతో సేకరించారు. కార్యక్రమంలో ఉపేంద్ర నాయుడు, గౌరీశ్వర్ నాయుడు, బోయ శివ, రవితేజ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో ఆనందం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సుబ్బారెడ్డి, విద్యార్థులు

డోన్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' అమలుతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఎంఎస్ఆర్ కార్యాలయంలో విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ కావడంతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీఎం శ్రీనివాసులు, గండికోట రామసుబ్బయ్య, లోకేశ్‌గౌడు, కోనేటి కాశీ విశ్వనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' హర్షం: టీడీపీ

కొలిమిగుండ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం అమలుతో తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోందని టీడీపీ మండల కన్వీనర్ మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. శనివారం వీఆర్ టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒక్కరికి మాత్రమే నిధులు జమచేయగా, కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి నిధులు జమ కావడం హర్షణీయమన్నారు. మండలంలో 6768 మంది తల్లుల ఖాతాల్లో నిధులు జమ అయినట్లు తెలిపారు. సమావేశంలో అంబటి జయలక్ష్మిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే ధ్యేయం

శిరివెళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు అన్నారు. గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు శీలం లక్ష్మీప్రసాద్, రామ్మోహన్, మద్దిలేటి, తపసి శ్రీరాములు, హుసేన్ బాషా, సుబ్బ చెన్నుడు, జయపాల్, ఓబులేసు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలి

డోన్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట విజయభాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బస్సులు కాలేజీ, పాఠశాలల సమయానికి నడపాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

చాగలమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు(20) ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చిన్నవంగలి గ్రామంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఏకైక కుమారుడు శ్రీనివాసులు. కుటుంబ సభ్యులంతా మిద్దెపై నిద్రిస్తుండగా శ్రీనివాసులు శుక్రవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడు కొంతకాలంగా ఓ వివాహితతో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలు కనిపించడం లేదా?:ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటూ వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. శనివారం ఆమె మాట్లాడుతూ తల్లికి వందనం పథకం తీసుకొన్న ప్రతి ఇల్లు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రి నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతి వైసీపీ నాయకుడిపై చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

డోన్ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోత్రాయి గ్రామ పంచాయతీ సచివాలయంలోని గ్రామ రైతులకు టీడీపీ సీనియర్ నాయకులు ఆలంకొండ గిడ్డారెడ్డి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీవర్ధన్ రెడ్డి, బాల చంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణేదీ?

- నాటారు.. వదిలేశారు..!
- కానరాని మొక్కలు
- రూ. లక్షల నిధులు వృథా

బనగానపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం మొక్కలను నాటింది కదా కానీ వాటిని సంరక్షించలేదు. ప్రతి సంవత్సరం లక్ష్యం పెట్టుకొని మొక్కలు నాటి సంరక్షణ మాత్రం గాలికి వదిలేశారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం బిల్లులు చేసుకోవడంతో ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులకు అలవాటుగా మారిపోయింది. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగం అయ్యాయి. రోడ్లకు ఇరువైపులా ఒక్క మొక్క కూడా నేడు కనిపించపోవడం విశేషం.

2021 నుంచి 2024 వరకు..

అప్పలాపురం, క్రిష్టగిరి, మిట్టపల్లె, నందివర్గం, పసుపుల, పాతపాడు, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు లక్షలు వెచ్చించారు. మెటీరియల్, మొ క్కల, ఉపాధి కూలీల కోసం, మొక్కలు నాటేందు కు నీరు, తదితర వాటికి లక్షలు ఖర్చుపెట్టారు. వాటిని సంరక్షించే బాధ్యతను ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులు, ఆయా గ్రామ సర్పంచ్‌లకు అప్పగించారు. ఒక్క మొక్క ఎండినా సర్పంచ్‌లదే బాధ్యత అని గతంలో వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమంపై సర్పంచ్‌లు పట్టించుకోలేదు. అధికారులు నిర్లక్ష్యం వహించారు. నాటిన మొక్కలను ఎలాంటి సంరక్షణ లేకపోవడంతో వాటిని మేకలు, గొర్రెలు తినేశాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్ష్యం నీరు గారిపోయింది.

అందినకాడికి స్వాహా..

మండలంలోని చాలా గ్రామాల పరిధిలో రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటినట్లు లెక్కలు చెబుతు న్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల సంరక్షణకు రెండేళ్ల పాటు బిల్లులు చెల్లించారు. కాని ఆబిల్లులు అందిన కాడికి అందినట్లు స్వాహా చేశారు. మొక్కలు నాటిన తర్వాత వాటి గురించి పట్టించుకునే వారు లేక మొక్కలు కనుమరుగయ్యాయి. లక్షలు వెచ్చించి ట్రీగార్డులు కూడా అందజేశారు. కాని ట్రీగార్డులు లేవు. మొక్కలు లేవు.

ఆ మొక్కల ఆనవాళ్లు కూడా..

అవెన్యూ ప్లాంటేషన్‌లోఐదేళ్లలో అధికారులు మొక్కలు నాటగా ఆ మొక్కల ఆనవాళ్లు కూడా నేడు కనిపించడం లేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటడం వాటి సంరక్షణా బాధ్యత అధికారులు చేపట్టకపో వడంతో లక్షల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అయిందని చెప్పవచ్చు. వనసంరక్షణ కేవలం మాటల వరకే పరిమితమయ్యాయి.



రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)



ఎండిపోవడంతో కానరాని మొక్కలు

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ

బనగానపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతు లను స్వీకరించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్‌లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అలాగే అధికారులు, ఉద్యోగులు అధికంగా మంత్రిని కలుసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తా

మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నంద వరం చౌడేశ్వరీ ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నందవరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, అర్చకులు, బది లీ అయిన ఆలయ ఈవో కామేశ్వరమ్మ శనివారం సాయం త్రం క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయ అభివృద్ధి, పరిశుభ్రతపై మంత్రి ఈవో శ్రీనివాసరెడ్డికి పలు సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్గించేలా కృషి చేయాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ కల్పతరువు అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో 42మంది లబ్ధిదారులకు రూ.25లక్షల విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. బాధితులు సీఎం చంద్రబాబుకు, మంత్రి బీసీకి ధన్యవాదాలు తెలిపారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

మానవత్వం చాటుకున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. శనివారం మంత్రి కాన్వాయ్ కోవెలకుంట్ల మీదుగా కడపకు వెళ్తుండగా భీమునిపాడు వద్ద బైక్‌పై వెళుతున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న బీసీ కాన్వాయ్ ఆపి బాధితులను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలంటూ అధికారులను ఆదేశించారు.

గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలి

- ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్
- సీమ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఆళ్లగడ్డ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో గ్రేటర్ రాయల సీమ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. డీఎస్పీ ప్రమోద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాడ్మింటన్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో రాయలసీమ స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. మొదటి బహుమతి రూ. 15 వేలు శిల్పకళామందిర్ బాలసుబ్రమణ్యం, రెండవ బహుమతి రూ. 12 వేలు సంజీవ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆంజనేయులు, మూడవ బహుమతి రూ. 10 వేలు ప్రజ్ఞా విద్యాసంస్థలు, నాలుగవ బహుమతి రూ .ఎనిమిదివేలు మహాసాయి శిల్పకళామందిర్, ఐదవ బహుమతి రూ. ఐదు వేలు న్యాయవాది సుబ్బారెడ్డి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ ప్రమోద్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మున్సిపల్ కమిషనర్ కిషోర్

ఆళ్లగడ్డ జూన్ 14(ఆంధ్రజ్యోతి): రోజు యోగాసనాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శనివారం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని కమిషనర్ ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది, అధికారులు యోగాసనాలు వేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా డేను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు బాలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం : యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు అన్నారు. శనివారం రుద్రవరంలో నిర్వహించిన యోగాంధ్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతివ్యక్తికి యోగా ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. ఈ నెల 21న యోగా దినోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు

చాగలమర్రి : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు చేయిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జగ్గయ్య తెలిపారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులచే యోగాసనాలు చేయించారు. అనంతరం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఈ కొండారెడ్డి, యోగా శిక్షకులు తేజశ్విని, విష్ణుప్రియ, ఏపీవో ఖాసీం, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఉపాధి సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో యోగా చేస్తున్న కమిషనర్, అధికారులు



చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో యోగా చేస్తున్న ఆయా శాఖల ఉద్యోగులు

జలకళ

- నిండుకుండల్లా నీటి కుంటలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాపిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలకళ సంచరించుకుంది. చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, కందకాలు నిండు కుండల ఉన్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కలచట్ల, ఎస్ రంగాపురం, చిన్నపూదిళ్ల, పెద్దపూదిళ్ల, ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో వాటర్ షెడ్, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నీటి కుంటలు, కందకాలలో వర్షపు నీరు చేరుకోవడంతో జల కళ సంచరించుకుంది. దీంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఉండటంతో పాటు పశువులకు తాగునీటి సమస్య తీరుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కలచట్ల గ్రామంలో వర్షపు నీటితో కళకళలాడుతున్న నీటి కుంట

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, ముడురాళ్లపల్లె రహదారిలో గల అభయాంజనేయస్వామికి శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా హనుమాన్ వ్రతాన్ని, భజన కార్యక్రమాలు నిర్వహించారు. చాగలమర్రి గాంధీ బజార్‌లోని వీరాంజనేయ స్వామికి మహిళలు తమలపాకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మాసాపురం లింగేశ్వరస్వామికి అభిషేకం

రుద్రవరం జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాపురంలో కొలువుతీరిన మానసలింగేశ్వరస్వామికి భక్తులు శనివారం అభిషేకం నిర్వహించారు. అర్చకులు శివశర్మ వేదమంత్రోచ్ఛరణల మధ్య భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం త్రిపురం సుందరీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడు



అశ్వవాహనంపై బుగ్గ వేంకటేశ్వరుడు

సంజామల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నొస్సం గ్రామంలో వెలిసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి శనివారం అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. వేద పండితులు ఉదయాన్నే స్వామివారిని అలంకరించి ప్రాతఃకాలపూజ, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకొని స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు గాధంశెట్టి రమణయ్య, వెంకటేశ్వరులు లక్ష్మీనారాయణ, మధుసూదన్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, పార్థసారధి రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి వైద్యుడు శివమోహన్ సూచించారు. శనివారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, హెచ్‌ఈ వెంకటమ్మ,సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

చాగలమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. సూపర్-6 పథకాలు అమలు చేస్తోందని అన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే తల్లుల ఖాతాల్లోకి తల్లివందనం అమలు చేయడంపై సర్వత్రా హర్షం ప్రకటిస్తున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

- నిందితుడి అరెస్ట్

రుద్రవరం జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో శనివారం బెల్ట్ షాపుపై స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సీఐ శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో దాడి చేశారు. 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకుడు శ్రీకాంత్ కుమార్ రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ విజయకుమార్ తెలిపారు.

ఘనంగా చేగువేరా జయంతి

బేతంచెర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ విప్లవ యోధుడు చే గువేరా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్‌ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లకృష్ణ, మధు రమేష్, హుసేన్, మధు, ఖదీర్, అక్రమ్, మధుకుమార్, తాహేర్, ఉమర్, సుమన్ పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

బేతంచెర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సూచించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బేతంచెర్ల జనసేన మండల నాయకులు శ్రీకంటి మధు, మనోజ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ప్రభుత్వ వైద్యులు సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు

ప్యాపిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచట్ల గ్రామంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తన నిధులతో శనివారం బోరు వేయించారు. నీళ్లు సంవృద్ధిగా పడటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో వాటర్ షెడ్ పథకం ద్వారా ఆర్వో ప్లాంట్ నాబార్డ్ రూ.3లక్షల నిధుల మంజూరు చేసింది. అయితే ఆ నిధులు సరిపోకపోవడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి బోరు వేయించినట్లు టీడీపీ నాయకులు ప్రసాద్, రవి తెలిపారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ

కోవెలకుంట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు విక్కీ గోపిరెడ్డి దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ చేశారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ నాగరాజు ఇటీవల షుగర్ వ్యాధితో కాలు కోల్పోయారు. దీంతో మానవతా దృక్పథంతో విక్కీ ఫౌండేషన్ తరపున ట్రైసైకిల్ అందజేశారు. కార్యక్రమంలో మురళి, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రుద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ దస్తగిరి బాబు అన్నారు. శనివారం రుద్రవరం అమ్మవారిశాలలో ఆయన సీసీ కెమెరాలు పరిశీలించారు. వాసాపురం ఆలయాన్ని పరిశీలించి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. దేవాలయాల వద్ద వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్వీ రంగనాయకులు, సుబ్రహ్మణ్యం, ఈడిగ నరసింహులు పాల్గొన్నారు.

అహోబిల దేవస్థానానికి వెండి వస్తువుల వితరణ

ఆళ్లగడ్డ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవస్థానానికి ఆళ్లగడ్డకు చెందిన మంచా లక్ష్మీనరసింహ నవీన్, మంచా లక్ష్మీనరసింహ నీరజ్ వెండి హారతి ఆలయ ప్రధాన అర్చకులకు శనివారం అందజేశారు. దాతలు కుమార్ మాట్లాడుతూ రూ 1,10,000లు విలువ గల కేజీ వెండి వస్తువులను ఆలయానికి వితరణ చేసినట్లు వివరించారు.